ప్రజాశక్తి
సోమవారం 27 జనవరి 2025
5
విజయనగరం

శంబర జాతరకు 130 బస్సులు

ప్రజాశక్తి-విజయనగరం కోట

శంబర జాతరకు 130 ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి సిహెచ్. అప్పలనారాయణ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. సోమ, మంగళ, బుధవారాల్లో శంబర జాతర జరగనుందని చెప్పారు. ఈ నేపథ్యంలో విజయనగరం నుంచి 20, శృంగవరపుకోట నుంచి 10, పార్వతీపురం నుంచి 35, సాలూరు నుంచి 45, పాలకొండ నుంచి 10, శ్రీకాకుళం నుంచి 10.. మొత్తం 130 బస్సులు నడుపుతున్నట్లు వెల్లడించారు. ఈ బస్సులు గజపతినగరం, రామభద్రపురం, రాజాం, బొబ్బిలి, పార్వతీపురం మీదుగా రాకపోకలు సాగిస్తాయని, ఈ అవకాశాన్ని యాత్రికులు వినియోగించుకోవాలని కోరారు.

2047 నాటికి స్వర్ణ విజయనగరం

- గణతంత్ర వేడుకల్లో కలెక్టర్ అంబేద్కర్
- ఆకట్టుకున్న శకట ప్రదర్శన, స్టాల్స్
- ఆహ్లాద పరిచిన సాంస్కృతిక కార్యక్రమాలు
- ఉత్తమ అధికారులు, సిబ్బందికి ప్రశంసా పత్రాలు

మాట్లాడుతున్న కలెక్టర్ అంబేద్కర్

జెండా వందనం చేస్తున్న కలెక్టర్ అంబేద్కర్, ఎస్పి వకుల్ జిందాల్, జెసి సేతు మాధవన్

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

2047 నాటికి స్వర్ణాంధ్ర లక్ష్యాల సాధనలో భాగంగా మన జిల్లాను సువర్ణ విజయనగరంగా మార్చేందుకు ప్రణాళికా బద్ధంగా కృషి చేస్తున్నామని కలెక్టర్ బిఆర్ అంబేద్కర్ చెప్పారు. స్వర్ణాంధ్ర విజన్ ప్లాన్ అమల్లో మనవంతు పాత్రను పోషిద్దామని ఆయన పిలుపునిచ్చారు. స్థానిక పోలీస్ పరేడ్ గ్రౌండ్లో ఆదివారం నిర్వహించిన 76వ గణతంత్ర దినోత్సవ వేడుకలకు కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై, జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. గౌరవ వందనాన్ని స్వీకరించారు. సాయుధ దళాల పరేడ్‌ను తిలకించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. జిల్లా అభివృద్ధికి రూపొందించిన ప్రణాళికలు, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను తెలియజేశారు. స్వర్ణాంధ్ర-2047 విజన్ ప్లాన్ అంశాల్లో భాగంగా జిల్లాలో నిర్దేశించుకున్న లక్ష్యాలు, వాటి సాధనా ప్రణాళికలను వివరించారు. గణతంత్ర దినోత్సవ వేడుకలకు హాజరైన ప్రముఖులను కలెక్టర్ పరిచయం చేసుకొని కృతజ్ఞతలు తెలిపారు. పోలీసు జాగిలాల ప్రదర్శన అబ్బుర పరిచింది. వివిధ పాఠశాలల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆద్యంతమూ ఆహ్లాద పరిచాయి. ప్రభుత్వ శాఖలు తమ ప్రగతిని చాటిచెబుతూ ప్రదర్శించిన శకటాలు ఆకట్టుకున్నాయి. అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, విన్యాసాలను అగ్నిమాపక శాఖ సిబ్బంది ప్రత్యక్షంగా చేసి చూపించి, ప్రజల్ని చైతన్యపరిచారు. పలు ప్రభుత్వ శాఖల్లో ఉత్తమ సేవలను అందిస్తున్న జిల్లా అధికారులు, సిబ్బందికి, వారి సేవలను అభినందిస్తూ కలెక్టర్ అంబేద్కర్ ప్రశంసా పత్రాలను అందజేశారు. సుమారు 578 ఉద్యోగులు ప్రశంసా పత్రాలను అందుకున్నారు. జిల్లా అధికారుల కోసం ప్రత్యేకంగా ఈ ఏడాది రూపొందించిన ప్రశంసా పత్రం అందరినీ ఆకట్టుకుంది. పలు ప్రభుత్వ శాఖలు స్టాళ్లను ఏర్పాటు చేసి, తమ శాఖా పరమైన ప్రగతి కార్యక్రమాలు, ఉపకరణాలను ప్రదర్శించాయి. ఈ వేడుకల్లో ఎంఎస్‌ఎంఇ, సెర్ప్, ఎన్ఆర్ఐ వ్యవహారాల శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎమ్‌పి కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, జిల్లా న్యాయమూర్తి సాయి కల్యాణచక్రవర్తి, ఎస్‌పి వకుల్ జిందాల్, జాయింట్ కలెక్టర్ ఎస్.సేతు మాధవన్, డిఆర్‌ఒ ఎస్.శ్రీనివాసమూర్తి, ఆర్‌డిఒ డి.కీర్తి తదితర ప్రముఖులు, ఉన్నతాధికారులు, ఉద్యోగులు, వివిధ సంస్థల ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సాయుధ దళాల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న కలెక్టర్ అంబేద్కర్ ; దేశభక్తి గేయానికి విద్యార్థుల ప్రదర్శన

యుద్ధ విన్యాసాలు ప్రదర్శిస్తున్న బాలిక

బాక్సింగ్ క్రీడను ప్రదర్శిస్తున్న బాలుడు

ఆకట్టుకున్న స్టాళ్లు

విజయనగరం కోట : పరేడ్ గ్రౌండ్లో వివిధ ప్రభుత్వ శాఖలు స్టాళ్లను ఏర్పాటు చేశాయి. తమ శాఖా పరమైన కార్యక్రమాలను ఫ్లెక్సీల ద్వారా వివరించడమే కాకుండా, వివిధ ఉపకరణాలను, పరికరాలను ప్రదర్శించాయి. జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ, పౌర సరఫరాల శాఖ, వ్యవసాయ శాఖ, పశు సంవర్ధకశాఖ, వైద్యారోగ్యశాఖ, సెంచూరియన్ విశ్వ విద్యాలయం, ఉపాధి, శిక్షణ శాఖ, కాలుష్య నియంత్రణ మండలి, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ, సర్వే శాఖ, గిరిజన సహకార సంస్థ, మహిళా భివృద్ధి శిశు సంక్షేమ శాఖ, మత్స్యశాఖలు స్టాళ్లను ఏర్పాటు చేశాయి.

మహిళా సంఘాలకు రూ.51.93 కోట్ల రుణాలు

జిల్లాలోని మహిళా స్వయంశక్తి సంఘాలకు డిఆర్‌డిఎ ద్వారా బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి, పిఎంఇజిపి కింద రుణాలను కలెక్టర్ బి.ఆర్.అంబేద్కర్, ఎస్‌పి వకుల్ జిందాల్, జాయింట్ కలెక్టర్ ఎస్.సేతుమాధవన్ అందజేశారు. జిల్లాలోని 873 సంఘాలకు రూ.51.93 కోట్ల రుణాలకు సంబంధించి చెక్కులను పంపిణీ చేశారు. బ్యాంకు లింకేజీ కింద 247 సంఘాలకు రూ.39.33 కోట్లు, స్త్రీనిధి కింద 553 సంఘాలకు రూ.10.44 కోట్లు, పిఎంఇజిపి కింద 73 సంఘాలకు రూ.2.16 కోట్లు అందజేసినట్లు డిఆర్‌డిఎ పీడీ కళ్యాణ్ చక్రవర్తి తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌ఒ ఎస్.శ్రీనివాసమూర్తి, అదనపు ఎస్‌పి సౌమ్యలత, డిఆర్‌డిఎ ఎపిడి సావిత్రి, తదితరులు పాల్గొన్నారు.

స్టాళ్లను పరిశీలిస్తున్న కలెక్టర్ బిఆర్ అంబేద్కర్, ఎస్పి వకుల్ జిందాల్

అబ్బుర పరిచిన సాంస్కృతిక కార్యక్రమాలు

విజయనగరం కోట : గణతంత్ర దినోత్సవ వేడుకల్లో కంటోన్మెంట్ మున్సిపల్ హైస్కూల్, బిపిఎం స్కూల్‌కు చెందిన సుమారు 300 మంది విద్యార్థులు మాస్ డ్రిల్ ప్రదర్శించారు. కొండవెలగాడ జెడ్‌పి హైస్కూల్ విద్యార్థులు భరతఖండమే నాదేశం నృత్య ప్రదర్శన చేశారు. విజయనగరం కెజిబివి విద్యార్థులు నమో నమో కేదారనాథ్ బోలునాథ శంకర్, నెల్లిమర్ల ఎంజెపిఎపిబిసిడబ్ల్యూఆర్ స్కూల్ విద్యార్థులు జగతి సిగలో జాబిలమ్మ, చీపురుపల్లి, రాజాం బాలభవన్ విద్యార్థులు వందేమాతరం, చీపురుపల్లి, కొత్తవలస, నెల్లిమర్ల గురుకులాల విద్యార్థులు నృత్య ప్రదర్శన, కొత్తవలస హైస్కూల్ విద్యార్థుల థింసా నృత్యం, నెల్లిమర్ల కెజిబివి విద్యార్థుల పాడుదమా స్వేచ్ఛాగీతం నృత్య ప్రదర్శనలు ఎంతగానో అలరించాయి. వీటిలో విజయనగరం కెజిబివి విద్యార్థుల ప్రదర్శనకు మొదటి బహుమతి లభించింది. కొత్తవలస జెడ్‌పి హైస్కూల్‌కు ద్వితీయ బహుమతి, చీపురుపల్లి, రాజాం బాలభవన్‌కు తృతీయ బహుమతి, నెల్లిమర్ల కెజిబివికి ప్రోత్సాహక బహుమతి లభించాయి.

గణతంత్ర దినోత్సవ వేడుకలకు హాజరైన మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి కళ్యాణ చక్రవర్తి ; దేశభక్తి గేయానికి విద్యార్థినుల ప్రదర్శన

వ్యవసాయ కార్పొరేటీకరణపై ఆగ్రహం

రైతు, వ్యవసాయ కార్మిక, కార్మిక సంఘాల ఆధ్వర్యాన నిరసనలు

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, రైతు కూలీ, ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలపై రైతు, వ్యవసాయ కార్మిక, కార్మిక సంఘాల నుంచి ఆగ్రహం వ్యక్తమైంది. రిపబ్లిక్ డే సందర్భంగా సంయుక్త కిసాన్ మోర్చా, కేంద్ర కార్మిక సంఘాల ఐక్యవేదిక ఇచ్చిన పిలుపులో భాగంగా విజయనగరం, బొబ్బిలిలో ఆదివారం నిరసనలు చేపట్టారు. కలెక్టరేట్ సెంటర్‌లోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ దేశ రైతాంగానికి క్షమాపణ చెప్పి, మూడు వ్యవసాయ చట్టాలను రద్దు చేస్తున్నట్లు ప్రధాని మోడీ ప్రకటించి, మళ్లీ అవే చట్టాలను అమలు చేసేందుకు కుట్ర పన్నుతున్నారని విమర్శించారు. వ్యవసాయాన్ని కార్పొరేటీకరణ చేసేందుకు రైతు మెడకు ఉరితాడులా వ్యవసాయ సాంకేతిక చట్టం, సహకార చట్టం వంటి నూతన చట్టాలను కేంద్ర ప్రభుత్వం తీసుకువస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఢిల్లీ రైతు ఉద్యమం సందర్భంగా రాతపూర్వకంగా ఇచ్చిన వాగ్దానాలను కేంద్ర ప్రభుత్వం గాలికి వదిలివేసిందని దుయ్యబట్టారు. కొత్తగా తీసుకువచ్చిన సహకార చట్టం, వ్యవసాయ సాంకేతిక చట్టం, జాతీయ వ్యవసాయ మార్కెటింగ్ చట్టం మొత్తం రైతాంగాన్ని కార్పొరేట్ కంపెనీల పెత్తనం కిందకు తెచ్చేందుకేనని విమర్శించారు. సహకార చట్టంలో చేసిన మార్పుల వల్ల సహకార వ్యవస్థలన్నీ కార్పొరేట్ కంపెనీల హస్తగతం అవుతాయని ఆందోళన వ్యక్తంచేశారు. రైతులు పండించిన పంటలకు మద్దతు ధరల విధానమే ఇక ఉండదని, వ్యాపారుల ఇష్టారాజ్యం అవుతుందని చెప్పారు. ప్రభుత్వాల కొనుగోళ్లు ఉండవని, ఆహార భద్రత చట్టానికి తావు లేదని తెలిపారు. ఇప్పటికే కేంద్రం ఉపాధి హామీ చట్టానికి తూట్లు పొడుస్తోందని, విద్యుత్తు సవరణ చట్టాన్ని యథాతథంగా అమలు చేయాలని చూస్తోందని ధ్వజమెత్తారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు ప్రయత్నాలు చేస్తోందన్నారు. ఏప్రిల్ ఒకటో తేది నుంచి నాలుగు లేబర్ కోడ్ల అమలుకు పూనుకుందని దుయ్యబట్టారు. నూతన వ్యవసాయ చట్టాలను, లేబర్ కోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.రాంబాబు, సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి పి.శంకర్రావు, కె.సురేష్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి జి.శ్రీనివాస్, జి.అప్పారావు, ఎఐటియుసి జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రంగారాజు, అశోక్, ఎఐఎఫ్‌టియు నాయకులు బెహరా శంకర్రావు, అప్పలరాజు, రైతు సంఘం నాయకులు ఆదినారాయణ, జగన్, సిఐటియు నాయకులు టి.వి.రమణ, వి.లక్ష్మి, బి.సుధారాణి, అప్పలసూరి, బి.రమణ, ఎ.జగన్మోహన్, బి.సూర్యనారాయణ, ఎం.రమణ, ఎ.గౌర్నాయుడు, బుజ్జమ్మ, తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి : రైతు, కార్మిక సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో బొబ్బిలిలో బైక్ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ విధానాలను అవలంబిస్తూ రైతు, కార్మిక సమస్యలను పక్కదోవ పట్టిస్తోందన్నారు. ప్రభుత్వ రంగాన్ని పూర్తిగా ప్రయివేటుపరం చేయాలని చూస్తోందని విమర్శించారు. రైతులు పండిస్తున్న పంటకు గిట్టుబాటు ధర లేక రైతుల ఆత్మహత్యలు పెరిగిపోతున్నాయని వాపోయారు. రైతులు ఇన్ని ఇబ్బందులు పడుతుంటే కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ నల్ల చట్టాలు తీసుకొచ్చి, వ్యవసాయ కార్పొరేటీకరణకు ప్రయత్నిస్తోందని దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్.గోపాలం, ఐఎఫ్‌టియు నాయకులు ఎం.గోపాలం, ఎఐటియుసి జిల్లా సహాయ కార్యదర్శి ఎం.శ్రీనివాసు, సిఐటియు నాయకులు బి.శ్రీను, ఎ.సురేష్, రైతు సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు వేమిరెడ్డి లక్ష్మునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద నిరసన చేపడుతున్న రైతు, వ్యవసాయ కార్మిక, కార్మిక సంఘాల నాయకులు

బొబ్బిలిలో బైక్ ర్యాలీ చేపడుతున్న రైతు, కార్మిక సంఘాల నాయకులు

వచ్చే విద్యా సంవత్సరంలో క్రీడా పాఠశాల ప్రారంభం

- క్రీడా హబ్‌గా జిల్లాను తయారు చేయడం లక్ష్యం
- 'ప్రజాశక్తి'తో జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎస్.వెంకటేశ్వరరావు ముఖాముఖి



ప్రజాశక్తి-విజయనగరం టౌన్

వచ్చే విద్యా సంవత్సరం నుంచి జిల్లాలో క్రీడా పాఠశాల, ఖోఖో, కబడ్డీ అకాడమీలు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎస్.వెంకటేశ్వరరావు వెల్లడించారు. విజయనగరం జిల్లాను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహాయంతో క్రీడా హబ్‌గా మార్చడమే లక్ష్యంగా కృషి చేస్తామని తెలిపారు. ఈ వారం తనను కలిసిన 'ప్రజాశక్తి'కి డిఎస్‌డిఒ ముఖాముఖి ఇంటర్వ్యూ ఇచ్చారు. జిల్లాలో క్రీడాభివృద్ధికి తీసుకుంటున్న చర్యలు, చేపడుతున్న కార్యక్రమాలను ఆయన వివరించారు. ఆ ఇంటర్వ్యూ వివరాలు...

రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన క్రీడా పాలసీ లక్ష్యం ఏమిటి.? మన జిల్లాకు ఏ విధంగా తోడ్పడుతుంది.?

మూడు ప్రధాన అంశాలతో నూతన క్రీడా పాలసీని ప్రభుత్వం రూపొందించింది. అందులో మొదటిది క్రీడా వసతులు కల్పించడం, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో క్రీడాకారులను తయారు చేయడం. రెండోది శిక్షణకు అకాడమీలు, క్రీడా పాఠశాలలు ఏర్పాటు చేయడం. మూడోది క్రీడల్లో విజేతలుగా నిలిచి ప్రతిభ కనబరిచిన వారికి నగదు బహుమతి, క్రీడా రిజర్వేషన్ కల్పించడం. క్రీడా పాలసీలో ఈ మూడు అంశాలే ప్రధానం.

జిల్లాకు మంజూరైన క్రీడా పాఠశాల ఎప్పుడు ప్రారంభిస్తారు.?

విజ్జీ క్రీడా మైదానంలో క్రీడా పాఠశాల నిర్వహణకు చర్యలు తీసుకుంటున్నాం. జూన్ నాటికి క్రీడా పాఠశాల ప్రారంభించే దిశగా అడుగులు వేస్తున్నాం. 72 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న విజ్జీ క్రీడా మైదానంలో పాఠశాలకు కావల్సిన భవన నిర్మాణం ఇప్పటికే చేపట్టిన విషయం తెలిసిందే. మూడు ఫ్లోర్లతో చేపట్టిన భవన నిర్మాణం మధ్యలో ఆగిపోయింది. వాటిని పూర్తి చేసేందుకు రూ.5 కోట్లతో ప్రతిపాదనలు జిల్లా కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి పంపించాం. భవనం నిర్మాణ ఇంటీరియల్ పనుల కోసం రూ.2 కోట్లు, రెండేళ్లపాటు పాఠశాల నిర్వహణకు, విద్యార్థుల భోజనాలకు, క్రీడా సామగ్రికి, మైదానాల నిర్వహణ సిబ్బంది వేతనాల కోసం మరో రూ.3 కోట్లు కావాలి.



విజ్జీ క్రీడా మైదానంలో బాక్సింగ్ రింగ్, ఇండోర్ స్టేడియం ఎప్పుడు అందుబాటులోకి వస్తాయి.?

ఇండోర్ స్టేడియాన్ని ఇప్పటికే క్రీడా మంత్రి రాంప్రసాద్‌రెడ్డి ప్రారంభించారు. రూ.40 లక్షలతో దీనిని నిర్మించాం. బాక్సింగ్ రింగ్ 80 శాతం పనులు పూర్తయ్యాయి. 20 శాతం పనులు పూర్తి చేసి మార్చికి ప్రారంభిస్తాం. రూ.6 లక్షలతో కొనుగోలు చేసిన బాక్సింగ్ మెటీరియల్ శాప్ రాష్ట్ర కార్యాలయంలో సిద్ధంగా ఉంది. నిర్మాణ పనులు పూర్తయిన వెంటనే వాటిని తీసుకొస్తాం.

హాకీ కోర్టు ఏర్పాటుకు తీసుకుంటున్న చర్యలు ఏమిటి.?

హాకీ క్రీడకు మైదానం లేదు. సింథటిక్ మైదానం కోసం రూ.6 కోట్లతో కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం.

విజ్జీ క్రీడా మైదానంలో మరుగుదొడ్ల సమస్య పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలు.?

విజ్జీ క్రీడా మైదానంలో మరుగుదొడ్ల సమస్య ఉంది. దీనిని పరిష్కరించేందుకు నగర పాలక సంస్థ సహకారం తీసుకుంటాం. నగర పాలక సంస్థ ద్వారా స్కేటింగ్ కోర్టు, అథ్లెటిక్స్ ట్రాక్, వాలీబాల్ మైదానం, బాక్సింగ్ హాల్ వద్ద మరుగుదొడ్లు నిర్మిస్తాం.

రాజీవ్ క్రీడా మైదానం అభివృద్ధికి ఎలాంటి చర్యలు చేపడుతున్నారు.?

రాజీవ్ క్రీడా మైదానంలో ఖో ఖో, కబడ్డీ అకాడమి ఏర్పాటు చేస్తాం. అందుకు సౌకర్యాల కోసం రూ.2 కోట్లతో ప్రతిపాదన పంపించాం. వచ్చే విద్యా సంవత్సరానికి అకాడమి ప్రారంభించే అవకాశముంది.

జిల్లాలో ఏ క్రీడలకు రెసిడెన్షియల్ సెంటర్ కోసం ప్రతిపాదనలు పంపించారు.?

కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన రెసిడెన్షియల్ సెంటర్ కోసం రెండు క్రీడా కేంద్రాలకు ప్రతిపాదన పంపాం. విజ్జీ క్రీడా మైదానంలో వెయిట్ లిఫ్టింగ్, తైక్వాండో క్రీడలకు రెసిడెన్షియల్ సెంటర్లు ఏర్పాటు చేయనున్నాం.

ఎన్ని క్రీడలకు కోచ్‌లు ఉన్నారు? ఇంకా ఎంతమంది అవసరం.?

జిల్లాలో 9 మంది మాత్రమే కోచ్‌లు ఉన్నారు. అథ్లెటిక్స్-2, ఫుట్‌బాల్-2, స్విమ్మింగ్, హాకీ, టేబుల్ టెన్నిస్, జూడో, వాలీబాల్, బాస్కెట్ బాల్, ఖోఖో, కబడ్డీ కోచ్‌లు కావాలి. అందుకోసం ప్రభుత్వానికి లేఖ రాశాం.

జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధీనంలో ఎన్ని మైదానాలు ఉన్నాయి? వాటి నిర్వహణ ఎలా ఉంది.?

క్రీడా ప్రాధికార సంస్థ ఆధీనంలో నగరంలో విజ్జీ, రాజీవ్ క్రీడా మైదానాలతోపాటు ఆక్వా కాంప్లెక్స్, కొండవెలగాడ వెయిట్ లిఫ్టింగ్ ఇండోర్ మైదానం ఉన్నాయి. అన్ని వినియోగంలో ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన క్రీడా పాలసీ అమల్లోకి రావడం ద్వారా జిల్లా క్రీడా హబ్‌గా తయారవుతోంది.

ప్రగతిని ప్రతిబింబించిన శకటాలు

ప్రథమ స్థానంలో నిలిచిన విద్య, ఐసిడిఎస్, వైద్యారోగ్య శాఖల శకటం

ప్రజాశక్తి-విజయనగరంకోట

గణతంత్ర దినోత్సవాల్లో స్వర్ణాంధ్ర -2047 విజన్ ప్లాన్‌లో ప్రభుత్వం నిర్దేశించిన అంశాల ఆధారంగా వివిధ ప్రభుత్వ శాఖలు రూపొందించిన శకటాలు ఆకట్టుకున్నాయి. సున్నా పేదరికంపై ముఖ్య ప్రణాళికా శాఖ, సెర్ప్, హౌసింగ్, ఉపాధి కల్పనపై పరిశ్రమలు, పర్యాటక శాఖలు, నైపుణ్యం, మానవ వనరుల అభివృద్ధిని వివరిస్తూ విద్య, నైపుణ్యాభివృద్ధి, వైద్య ఆరోగ్య, మహిళా శిశు సంక్షేమం, యువజన సర్వీసులు, క్రీడల శాఖలు, నీటి భద్రతపై నీటిపారుదల, ఆర్‌డబ్ల్యుఎస్, ఇపిఎఫ్ఎస్‌టి, రైతు వ్యవసాయ సాంకేతికతను వివరిస్తూ వ్యవసాయ, మత్స్యశాఖలు, ప్రపంచస్థాయి పంపిణీ వ్యవస్థపై డ్వామా, శక్తి, ఇంధన వ్యయ నియంత్రణను వివరిస్తూ ఇంధనశాఖ, ప్రొడక్షన్ ఫెర్‌ఫక్షన్‌పై ఉద్యాన శాఖ, స్వచ్ఛాంధ్ర ప్రాధాన్యతను వివరిస్తూ ఎంఎయుయుడి, సమగ్ర సాంకేతికతపై ప్రణాళికా శాఖతో పాటు సెంచూరియన్ యూనివర్సిటీ తమ శకటాలను ప్రదర్శించి ఆకట్టుకున్నాయి. ఈ శకటాల్లో విద్యాశాఖ, ఐసిడిఎస్, వైద్యారోగ్య శాఖలు సంయుక్తంగా ఏర్పాటు చేసిన శకటానికి మొదటి బహుమతి లభించింది. ఎపిఇపిడిసిఎల్ శకటానికి ద్వితీయ బహుమతి, ఉద్యాన శాఖ శకటానికి తృతీయ బహుమతి లభించాయి.

తృతీయ స్థానంలో నిలిచిన ఉద్యాన శాఖ శకటం

ద్వితీయ స్థానంలో నిలిచిన ఎపిఇపిడిసిఎల్ శకటం

ఫైనల్ మ్యాచ్‌ను ప్రారంభిస్తున్న టిడిపి రాష్ట్ర పరిశీలకులు సువ్వాడ రవిశేఖర్

యువత క్రీడలపై దృష్టి సారించాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

యువత క్రీడలపై దృష్టి సారించి భవిష్యత్తు తీర్చు దిద్దుకోవాలని టిడిపి రాష్ట్ర పరిశీలకులు సువ్వాడ రవిశేఖర్ పిలుపునిచ్చారు. ఆదివారం సతివాడలో సంక్రాంతి పండగ సందర్భంగా శ్రీహనుమాన్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న క్రికెట్ పోటీల్లో భాగంగా ఫైనల్‌కు చేరుకున్న మల్యాడ, కనిమెల్ల జట్ల మధ్య పోటీను ఆయన ఆదివారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ యువత విద్యతో బాటు క్రీడలపై దృష్టి పెట్టాలన్నారు. క్రీడలు శరీరకంగా, మానసికంగా ఉల్లాసానికి దోహద పడతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు రెల్లి వెంకటేష్, కోరాడ శ్రీను, ఆల్తి బెనర్జీ తదితరులు పాల్గొన్నారు.

గొల్లపల్లిలో క్రీడా ప్రాంగణం ప్రారంభం

బొబ్బిలి: మున్సిపాలిటీలోని గొల్లపల్లిలో ఆదివారం క్రీడా ప్రాంగణాన్ని ఎమ్మెల్యే బేబినాయన ప్రారంభించారు. బేబీనాయన సహకారంతో గ్రామ యూత్ క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత క్రీడలు పట్ల ఆసక్తి చూపాలని కోరారు. క్రీడలతో మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. అనంతరం ఎగువ కూరకుల వీధిలో తాగునీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడడంతో పబ్లిక్ కుళాయి ఏర్పాటు చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, యువకులు పాల్గొన్నారు.

సిఎస్ డిఎం మీనాకుమారి | డిఎస్ఒ మధుసూదనరావు | ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్‌ఇ కవిత | ఆర్అండ్‌బి ఎస్ఇ కాంతిమతి | పిఆర్ ఎస్‌ఇ శ్రీనివాస్ | జెడి వైవి రమణ | డిఆర్ఒ శ్రీనివాసమూర్తి | ఎఎస్‌పి సౌమ్యలత

చీపురుపల్లి ఆర్‌డిఒ సత్యవాణి | బొబ్బిలి ఆర్‌డిఒ రామ్మోహనరావు | డిఎస్‌డబ్ల్యుఒ రామానందం | ఎల్‌డిఎం మూర్తి | మార్కెటింగ్ ఎడి రవికిరణ్ | డిఆర్‌డిఎ పిడి చక్రవర్తి | కమిషనర్ నల్లనయ్య | డిఎస్‌డిఒ వెంకటేశ్వరరావు

గణతంత్ర దినోత్సవ వేడుకల్లో జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్‌కు ప్రశంసాపత్రం అందజేస్తున్న కలెక్టర్ బిఆర్ అంబేద్కర్, ఎస్‌పి వకుల్ జిందాల్

ఆర్అండ్‌బి డిఇ సత్యపణీశ్వర్ | డిఇ శారద | సిపిఒ బాలాజీ | ఎస్‌సి కార్పొరేషన్ ఇడి సుధారాణి | ఎస్‌డిసి ప్రమీల | ఆర్‌టిసి స్టాండింగ్ కౌన్సిల్ ప్రభాకరరావు | జిఎంసి సూపరింటెండెంట్ అప్పలనాయుడు | బాడంగి ఎంపిడిఒ రామకృష్ణ | డిఐపిఆర్ఒ రమేష్ | ఉపాధి కల్పనాధికారి అరుణ | పిహెచ్ ఇఇ జ్యోతి | ఉద్యానశాఖ డిడి జమదగ్ని

ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు

విజయనగరం టౌన్: నివాళులర్పిస్తున్న మేయర్ విజయలక్ష్మి

బొబ్బిలి: జెండా వందనం చేస్తున్న ఎమ్మెల్యే బేబినాయన

డెంకాడ: 5వ బెటాలియన్‌లో పిరమిడ్ విన్యాసాలు చేస్తున్న విద్యార్థులు

విజయనగరం కోట: జెండావిష్కరణలో పాల్గొన్న కేంద్ర మాజీ మంత్రి అశోక్,ఎమ్మెల్యే

ప్రజాశక్తి- బొబ్బిలి

పట్టణంలో గణతంత్ర దినోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. జాతీయ జెండాను మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ ఎల్.రామలక్ష్మి, ప్రభుత్వ ఆసుపత్రిలో సూపరింటెండెంట్ జి.శశిభూషణరావు, పోలీసు స్టేషన్లో పట్టణ సిఐ కె.సతీష్ కుమార్, వైసిపి కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం కార్యాలయంలో అధ్యక్షుడు కర్రి సత్యనారాయణ ఎగుర వేశారు.

చీపురుపల్లి: చీపురుపల్లి తహశీల్దారు కార్యాలయం వద్ద తహశీల్దారు ఎన్ రాజారావు, ఎంపిడిఒ కార్యాలయం వద్ద ఎఒ తామరాపల్లి ప్రవీణ్, పోలీస్ సర్కిల్ కార్యాలయంలో సిఐ శంకరరావు, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో టివికెఎస్ లక్ష్మణరావు, పంచాయతీ కార్యాలయంలో ఇఒ వై ఝాన్సీ, బాయ్స్ పాఠశాలలో హెచ్ఎం చంద్రశేఖర్‌లు పతాకావిష్కరణలను చేశారు. బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు జాతీయ జెండాలు చేత పట్టి భారీ ర్యాలీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి ఇప్పిలి వెంకటనర్సమ్మ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

బొబ్బిలిరూరల్: రాజ్యాంగ ఫలాలు ప్రతి ఒక్కరికి అందాలని ఎమ్మెల్యే బేబినాయన అన్నారు. ఆదివారం రిపబ్లిక్ డే సందర్భంగా స్థానిక తహశీల్దార్ కార్యాల యంలో తహశీల్దార్ యం.శ్రీను జెండాను ఎగుర వేశారు. కార్యక్రమంలో సిఎస్‌డిటి, ఎన్నికల డిటి, ఆర్.సాయికృష్ణ, గౌరిశంకర్రావు, విఆర్‌ఒలు పాల్గొన్నారు.

నెల్లిమర్ల: తహశీల్దార్ కార్యాలయం, మండల పరిషత్ కార్యాలయం, నగర పంచాయతీ కార్యాలయం, పోలీస్ స్టేషన్ ఆవరణలో తహశీల్దార్ పి. సుదర్శన రావు, కె. రామ కృష్ణరాజు, కె. అప్పలరాజు, బి.గణేష్ జెండా ఎగురు వేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ రవిశంకర్, ఎలక్షన్ డిటి వివిఆర్ జగన్నాధరావు, మండల పరిషత్ ఎఒ సుదర్శనం, ఎంఇఒలు పాల్గొన్నారు.

జెండా వందనం చేస్తున్న జెడ్‌పి చైర్మన్

సెంచూరియన్‌లో.. వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ప్రశాంత కుమార్ మహంతి ముఖ్య అతిధిగా సెంచూరియన్‌లో గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. ఇటీవల ఇంటర్ యూనివర్శిటీ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో విజేతగా నిలిచిన ఆదినారాయణను వైస్ ఛాన్సలర్ ప్రశాంత కుమార్ మహంతి చేతుల మీదుగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ పి.పల్లవి, డిప్యూటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్.ఎస్.వర్మ, డీన్ డాక్టర్ విజయ్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

శృంగవరపు కోట: పట్టణంలోని ఎంపిడిఒ కార్యాలయ ఆవరణంలో ఎంపిడిఒ సతీష్ ఆధ్వర్యంలో గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, టూరిజం బోర్డు డైరెక్టర్ ఇందుకూరి సుధారాజు పాల్గొని ఉద్యోగ నిర్వహణలో ప్రతిభ కనబరిచిన వారికి మెమొంటోలను అందజేశారు. పుణ్యగిరి వర్కింగ్ జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గణతంత్ర దినోత్సవం సందర్భంగా పట్టణంలోని దేవి కూడలిలో గల అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పట్టణంలోని పంచాయతీ కార్యాలయ ఆవరణంలో పంచాయతీ కార్యనిర్వాహణాధికారి అనురాధ అధ్యక్షతన గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గనివాడ సంతోష్‌కుమారి, పాల్గొన్నారు.

కొత్తవలస: స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ నీలకంఠరావు, ఎంపిడిఒ కార్యాలయం ఎంపిడిఒ రమణయ్య, స్థానిక పోలీస్ స్టేషన్‌లో సిఐ షణ్ముఖరావు, కొత్తవలస డాబాల ఎలిమెంటరీ స్కూల్లో ఎంఇఒ జి శ్రీదేవి, శ్రీగురుదేవ్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ రాపర్తి జగదీష్ బాబు జెండా ఎగుర వేశారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు చీపురుపల్లి ఈశ్వరరావు జెండా ఎగరువేశారు. ఆరు విభాగాల్లో పిరమిడ్స్, విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

మెరకముడిదాం: స్థానిక ఎంపిడిఒ కార్యాలయం ఆవరణలో ఎంపిడిఒ భాస్కరరావు, నాయకులు తాడ్డి వేణుగోపాలరావు, వైస్ ఎంపిపి టి.హరిబాబు, ఎస్‌వి రమణరాజు, కోట్ల వెంకట రావు స్థానిక సర్పంచ్ పల్లి కృష్ణ జెండా ఎగుర వేశారు.

వేపాడ: విక్టరీ హై స్కూల్‌లో విద్యార్థులు దేశభక్తి పాటలు పాడి అందరిని అలరించారు. బాయ్స్ చేసిన పిరమిడ్స్ ఆకట్టుకున్నాయి. స్కూల్ అడ్మినిస్ట్రేటివి డైరెక్టర్ రాఘవ జాతీయ పతకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కరెస్పాండెంట్ దాళినాయుడు, ప్రిన్సిపాల్ శ్రీను పాల్గొన్నారు. మండలంలోని సింగరాయి, గుడివాడ, ఆర్ఎస్పేట, వావిలపాడు, గ్రామాలలో గల అంబేద్కర్ విగ్రహాలకి పూలమాలలు వేసి గణతంత్ర దినోత్సవ వేడుకలు ఆయా గ్రామాల సర్పంచులు నిర్వహించారు.

డెంకాడ: స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపిడిఒ వై. భవాని, తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ వి. పద్మావతి పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ ఎ.సన్యాసినాయుడు, మోడల్ స్కూల్లో ప్రిన్సిపల్ సిహెచ్ సంధ్యారాణి, జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి బంటుపల్లి వెంకటవాసుదేవరావు పాల్గొనగా, చింతలవలస 5వ బెటాలియన్‌లో కమాండెంట్ మల్లిక గార్గ్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి 28 మంది సిబ్బందికి ప్రశంస పత్రాలు అందజేశారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య అధికారిని వై.భవాని జాతీయ జెండాను ఎగుర వేశారు.

బాడంగి: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు దత్తి సత్యన్నారాయణ, బాలయోగి గురుకుల పాఠశాలలో నారాయణరావు, తహశీల్దార్ కార్యాలయం ఆవరణలో తహశీల్దార్ సుధాకర్, పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ తారకేశ్వరరావు, ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ రామకృష్ణ, ఎరుకుల పాకల పాఠశాలలో ఎంపిటిసి పాలవలస గౌరు, ఆకులకట్టలో ఉయ్యాలా సత్యనారాయణ జెండా ఎగురు వేశారు. అనంతరం పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన మార్చ్ ఫాస్ట్, సాంస్కృతిక కార్యక్రమాలు, విద్యార్థిలతో కలిసి జెడ్‌పిటిసి రామారావు చేసిన నృత్యం ఆకట్టుకుంది.

రేగిడి: మండలంలోని ఎంపిడిఒ కార్యాలయం ఆవరణలో ఎంపిడిఒ శ్యామల కుమారి, తహశీల్దార్ కార్యాలయం ఆవరణంలో తహశీల్దార్ చిన్నారావు జాతీయ జెండాను ఎగురవేశారు. ఉంగరాడమెట్ట డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, దేవుదళ కస్తూరిబా గాంధీ పాఠశాలలో ప్రిన్సిపాల్ లక్ష్మి, బూరాడ ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ చలమయ్య, రీనా చౌదరి, రేగిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ అసిరి నాయుడు జెండాను ఎగురవేశారు.

రామభద్రపురం: స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎఒ సన్యాసిరావు, పోలీసు స్టేషన్ వద్ద ఎస్ఐ ప్రసాదరావు, తహశీల్దార్ కార్యాలయం వద్ద తహశీల్దార్ సులోచనారాణి జాతీయ జెండా ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి అప్పికొండ సరస్వతమ్మ, సీనియర్ అసిస్టెంట్ చొక్కాపు శ్రీరాములునాయుడు, ఎంఇఒ తిరుమల ప్రసాద్, ఎపిఒ త్రినాథరావు, పాల్గొన్నారు.

కొత్తవలస: విన్యాసాలు చేస్తున్న విద్యార్థులు

రాజాం: మండల కేంద్రంలో జరిగిన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో తహశీల్దార్ కృష్ణంరాజు, పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ మాత మూర్తి జెండా ఎగుర వేశారు. విద్యార్థులు, మండల అధికారులు పాల్గొన్నారు.

వంగర: తహశీల్దార్ కార్యాలయం వద్ద తహశీల్దార్ డి ధర్మరాజు, పోలీస్ స్టేషన్ వద్ద ఎస్ఐ షేక్ శంకర్, మండల పరిషత్ వద్ద ఎంపిడిఒ త్రినాధరావు, వివేక మాస్టర్ మైండ్ పాఠశాల వద్ద ప్రిన్సిపాల్ బెవర ఈశ్వరరావు జెండా ఆవిష్కరణ చేశారు. వివేక మాస్టర్ మైండ్ పాఠశాల వద్ద విద్యార్థులు చేసిన పిరియడ్ విన్యాసాలు పలువురిని ఆకట్టుకున్నాయి. వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

విజయనగరంకోట : గణతంత్ర దినోత్సవ వేడుకలు జిల్లాలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కలెక్టరేట్ వద్ద జాతీయ పతాకాన్ని జాయింట్ కలెక్టర్ ఎస్.సేతు మాధవన్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో డిఆర్ఒ ఎస్. శ్రీనివాసమూర్తి పాల్గొన్నారు. ● అశోక్ బంగ్లాలో కేంద్ర మాజీమంత్రి పూసపాటి అశోక్ గజపతిరాజు.. జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్‌పి కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, పట్టణ అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, మండల అధ్యక్షులు బొద్దల నర్సింగరావు, కార్యదర్శి గంటా పోలినాయుడు, రాజేష్ బాబు, వేచలపు శ్రీనివాసరావు పాల్గొన్నారు. ● ఎఆర్ కార్యాలయం, శార్వాణి పోలీసు సంక్షేమ పాఠశాలలో ఎస్‌పి వకుల్ జిందాల్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. ● జిల్లా పోలీసు కార్యాలయంలో ఎఎస్‌పి సౌమ్యలత, పోలీసు శిక్షణ కళాశాలలో ప్రిన్సిపల్ డి.రామచంద్రరాజు జెండాను ఆవిష్కరించారు. ●అంబటిసత్రం వద్ద ఉన్న మక్కా మసీదులో జాతీయ జెండాను ఇమాం గుఫ్రాన్, వక్ఫ్ బోర్డు మాజీ అధ్యక్షులు ఎ. కరీం ఆవిష్కరించారు.

విజయనగరం టౌన్ : నగరపాలక సంస్థ కార్యాలయంలో కమిషనర్ పల్లి నల్లనయ్య త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు. ముందుగా మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి.. గాంధీ, అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. విశిష్ట సేవలు అందించిన సిబ్బందికి ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సహాయ కమిషనర్ సిహెచ్ తిరుమలరావు, కోఆప్షన్ సభ్యులు ఆశపు వేణు పాల్గొన్నారు. ● జెఎన్‌టియు-జివిలో ఇన్‌ఛార్జి విసి డి.రాజ్యలక్ష్మి, రిజిస్ట్రార్ జి.జయసుమ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ● జిల్లా పరిషత్ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన గణతంత్ర వేడుకల్లో జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పాల్గొన్నారు. ●జిఎస్ఆర్ కాంప్లెక్సు వద్ద జనసేన పార్టీ నాయకులు గురాన అయ్యలు ఆధ్వర్యాన గణతంత్ర వేడుకలు జరిగాయి. స్వాతంత్ర్య సమరయోధుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ● ఫోర్ట్ సిటీ పాఠశాలలో గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, మెడళ్లను పాఠశాల చైర్మన్ కె.ఎ.పి.రాజు (శివ) అందజేశారు. వైస్ చైర్మన్ చంటి, ప్రిన్సిపల్ డాక్టర్ రీయినా ఖాన్, డైరెక్టర్లు మధు, అశోక్, నీలిమ పాల్గొన్నారు. ● గురజాడ పాఠశాలలో గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ డాక్టర్ ఎంవిఆర్ కృష్ణాజి, కరస్పాండెంట్ స్వరూప, ప్రధానోపాధ్యాయులు పూడి శేఖర్ పాల్గొన్నారు. ● సీతం ఇంజినీరింగ్ కళాశాలలో సత్య డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎంవి సాయి దేవమణి ఆధ్వర్యాన నిర్వహించిన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో మువ్వన్నెల పతాకాన్ని సత్య విద్యాసంస్థల సెక్రటరీ, కరస్పాండెంట్ బొత్స ఝాన్సీలక్ష్మి ఆవిష్కరించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ మజ్జి శశిభూషణరావు, సీతం కళాశాల ప్రిన్సిపల్ డి.వి. రామమూర్తి పాల్గొన్నారు.

భోగాపురం: మండలంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వివిధ శాఖలకు చెందిన 33 మంది ఉద్యోగులను మండల పరిషత్ ఆధ్వర్యంలో ఎంపిపి ఉప్పాడ అనుషా రెడ్డి చేతుల మీదుగా అవార్డులను అందజేశారు. ఉప్పాడ సూర్యనారాయణ రెడ్డి పాల్గొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ కే.గాయత్రి, తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ ఎం సురేష్, ఆర్‌డబ్ల్యుఎస్ కార్యాలయంలో డిఇ జె వైకుంఠంనాయుడు జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి రావాడ బాబు, ఎంఇఒలు రమణమూర్తి, చంద్రమౌళి, అర్.ఐ ఇమ్రాన్, ఎఒ కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎంపిడిఒ, ఎఒ, ఎపిఎంలకు ప్రశంసా పత్రాలు

సంతకవిటి: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ఉత్తమ అధికారులకు ఎంపికైన ఎంపిడిఒ, ఎఒ, ఎపిఎంలకు తహశీల్దార్ సత్యం చేతులు మీదుగా ప్రశంసా పత్రాలను అందుకున్నారు.

భోగాపురం: ఉత్తమ అధికారులను సత్కరిస్తున్న ఎంపిపి అనూష

విజయనగరం కోట: జెండా వందనం చేస్తున్న ఎస్‌పి

వేపాడ: ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారులు

ఉత్తమ అధికారికి అవార్డు అందిస్తున్న తహశీల్దార్ సత్యం

చిలకపాలెం-ఆర్‌ఆర్‌పురం రోడ్డు విస్తరణ

ఎమ్‌పి కలిశెట్టి అప్పలనాయుడు

రామభద్రపురం : శ్రీకాకుళం జిల్లా చిలకపాలెం జంక్షన్ నుంచి విజయనగరం జిల్లా రాజాం, రామభద్రపురం మీదుగా మన్యం పార్వతీపురం జిల్లా కొమరాడ మండలం రావాడ రామభద్రపురం వరకు 4 లైన్ల రోడ్డు విస్తరణకు డిపిఆర్ సిద్ధమైనట్టు విజయనగరం ఎమ్‌పి కలిశెట్టి అప్పలనాయుడు తెలిపారు. ఈ మేరకు ఆదివారం రామభద్రపురం బైపాస్ రోడ్డు వద్ద ఆయన విలేకర్లతో మాట్లాడారు. కేంద్ర రవాణా శాఖా మంత్రి నితిన్ గడ్కారితో చర్చించి ఈ హైవే రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరామన్నారు. ఇప్పటికే దీనిపై కేంద్ర ప్రభుత్వం నుంచి హైవే శాఖాధికారులకు అనుమతులు వచ్చాయని, వచ్చే ఏడాది బడ్జెట్లో వీటికి నిధులు విడుదల కానున్నాయని తెలిపారు. విజయనగరం నుంచి నెలిమర్ల, పాలకొండ రోడ్డుతోపాటు రామతీర్థం నుంచి వయా రణస్థలం వరకు కొత్త రోడ్డు నిర్మాణాలకు ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. కార్యక్రమంలో నాయకులు చింతల రామకృష్ణ, బెవర సీతారాం, తాడ్డి శ్రీనివాసరావు, రవ్వ ఈశ్వరరావు, యోగినాయుడు పాల్గొన్నారు.

తాగునీటి వసతి, స్నానపు గదులు ప్రారంభం

శృంగవరపుకోట: పట్టణ కేంద్రంలోనీ పుణ్యగిరి రోడ్డులో గిరిజన బాలుర వసతి గృహంలో నూతనంగా ఏర్పాటు చేసిన తాగునీటి వసతిని, గిరిజన బాలికల కళాశాల వసతి గృహంలో జిల్లా పరిషత్ నిధులతో ఏర్పాటు చేసిన స్నానపు గదులను ఎమ్మెల్సీ ఇందుకూరి రఘు రాజు ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపిపి సండి సోమేశ్వరరావు, వైస్ ఎంపిపి ఇందుకూరి సుధారాణి, మేజర్ పంచాయతీ సర్పంచ్ గనివాడ సంతోషి కుమారి, ఎంపిటిసి దార గిరి, వాకాడ సింహాచలం పాల్గొన్నారు.

సింగరాయిలో పశువైద్య శిబిరం

వేపాడ : మండలంలోని సింగరాయిలో ఆదివారం పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని సర్పంచ్ నిరుద్యోగి వెంకటరావు ప్రారంభించారు.

మైదానానికి శంకుస్థాపన

ప్రజాశక్తి - పూసపాటిరేగ

మండలంలోని కొవ్వాడలో ప్రాథమిక పాఠశాల సమీపంలో క్రీడామైదానం ఏర్పాటుకు గ్రామ సర్పంచ్ కోట్ల రఘు ఆదివారం శంకుస్థాపన చేశారు. సుమారుగా రూ.25 లక్షలు సొంత నిధులతో మైదానానికి హంగులు హద్దనున్నట్లు తెలిపారు. క్రీడా మైదానానికి ప్రహరీ గోడకు ప్రభుత్వం రూ.10 లక్షలు నిధులు మంజూరు చేసింద న్నారు. అయితే ఆ మైదానం అంతా సుమా రుగా 20 అడుగులు లోతులో ఉందన్నారు. ఆ లోతును పూడ్చడానికి సుమారుగా 3 వేల లోడ్లు మట్టి పడుతుందన్నారు. దాంతో పాటు మైదానానికి చుట్టూ విద్యుత్ దీపాలతో పాటు పలు రకాల మొక్కలు, చెట్లునాటి సుందరంగా తయారు చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేసామన్నారు. ఈ రోజు నుండే పని ప్రారంబిస్తున్నట్లు తెలిపారు. ఊరును ఆనుకొని ఉన్న ఈ గుమ్మును పూడ్చాలన్నది దశాబ్దాల నాటి కల అని చెప్పారు. ఈ సందర్భంగా పార్టీలకతీతంగా గ్రామస్తులంతా సర్పంచ్‌ను అభినందిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బండి నర్సయ్య, వార్డు మెంబర్లు, దేబార్కి అప్పారావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ప్రశ్నించడమే ఆధునిక పురోగతికి మూలం

డెంకాడ: లెండి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ ఆర్ అండ్ డి సెంటర్ సంయుక్తంగా ఆదివారం రీసెర్చ్ ఇన్సిట్స్ అన్న అంశంపై ఒక రోజు అధ్యాపక శిక్షణ నిర్వహించారు. సంస్థ రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ డీన్ డాక్టర్ నరేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో డిఎస్‌టి భారత ప్రభుత్వం పూర్వపు సైంటిస్ట్ డాక్టర్ రాజీవ్ కె.తాయల్, డిఎస్‌టి హెడ్‌ఆఫ్ డివిజన్ డాక్టర్ డి. రాధా ప్రసాదరాజు పాల్గొని పరిశోధనలను ప్రోత్సహించడానికి పలు ప్రభుత్వ సంస్థలు నిర్వహిస్తున్న పథకాలను, పరిశోధన అనుమతుల గూర్చి అధ్యాపకులకు వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.వి.రామారెడ్డి, కళాశాల గవర్నింగ్ బాడీ మెంబర్ డాక్టర్ కోడూరు సురేష్, నిర్వాహకులు డాక్టర్ డి.నరేష్‌కుమార్, డాక్టర్ వి.అంజి రెడ్డి, పలు విభాగాల అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

గుర్ల : మండలంలోని కెల్ల గ్రామానికి చెందిన పంచాది శివ(31) చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మద్యానికి బానిసైన ఈయన మనస్తాపంతో ఈ నెల 18న ఇంటి దగ్గర ఎవరూ లేని సమయం చూసుకుని గడ్డి మందు తాగాడు. కుటుంబ సభ్యులు జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. భార్య తన కన్నవారింటికి పండగకు వెళ్లి వచ్చేసరికి ఆయన ఆత్మహత్య చేసుకోవడంతో బోరున విలపించారు. ఎస్ఐ పి. నారాయణరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వివాహిత అదృశ్యం

వేపాడ : మండలంలోని బొద్దాం గ్రామానికి చెందిన వివాహిత కె.వాణి(46) అదృశ్యమైనట్లు కేసునమోదు చేసినట్లు వల్లంపూడి ఎస్ఐ బి. దేవి తెలిపారు. ఈ నెల 8వ తేదీ నుంచి ఆమె కనిపించడం లేదని కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారన్నారు. ఈమె ఆచూకీ తెలిసినవారు 9121209451 నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ కోరారు.

నోటీసు
మహారాజశ్రీ విజయనగరం సీనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో
IA 22/15 in OS 201/05

Between :
దిండి కనకం వగైరాలు .....పిటిషనర్స్/వాదులు
And :
బియ్యపు సన్యాసమ్మ (died) మరియు ఇతరులు ....రెస్పాండెంట్సు/ప్రతివాదులు

పై దావాలోని IA 22/15 లో 2వ రెస్పాండెంటు అయిన దిండి వసంత W/o చంద్రరావు, భీమసింగి గ్రామం, జామి మండలం వారికి నోటీసు సర్వే కానందున ప్రత్యామ్నాయంగా ఈ పత్రికా ప్రకటన ద్వారా నోటీసును కోర్టువారు ఆర్డరు జారీ చేసియున్నారు. పై దావా వాయిదా **తేది 03-02-2025**న వాయిదా అయి ఉన్నది. కావున దిండి వసంత (2వ రెస్పాండెంట్ స్వయంగా గాని వారి తరపు న్యాయవాది ద్వారా గాని **ఉదయం 10-30 గం॥**లకు హాజరై తమ వాదనను వినిపించవలసినదిగా కోర్టువారు ఆదేశించియున్నారు. లేని ఎడల వారికి పరోక్షముగా కోర్టువారు నిర్ణయం తీసుకొందురు.

కూరెళ్ళ నాగభూషణరావు,
శిరిపురపు సత్యారావు,
న్యాయవాదులు,
విజయనగరం
తేది: 26-01-2025
కె.ఎల్.పురం, విజయనగరం

బహిరంగ ప్రకటన
శ్రీ మహారాశ్రీ జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్, రాజాం, వారి కోర్టులో
CC.No.201/2018

ఫిర్యాది – మొకర సంతోష్ కుమార్
మరియు
ముద్దాయి – టంకాల శ్రీరాం
టు,
టంకాల శ్రీరాం, తండ్రి రమణ, వ్యాపారం, మందరాడ గ్రామం, సంతకవిటి మండలం, సంతకవిటి P.S Limits, విజయనగరం జిల్లా.

పై నెంబరు CC.No.201/2018లో శ్రీ కోర్టు వారు పై ముద్దాయి అయిన మీకు చాలా పర్యాయములు, కోర్టు సమన్లు పంపించిన మీరు తపాలాశాఖ వారిని మరియు పోలీసు వారికి దొరకకుండా ఉద్దేశ్యపూరకంగా తప్పించుకుంటూయున్నారు. కావున శ్రీ కోర్టు వారు ఈ బహిరంగ ప్రకటన ద్వారా మీపై గల పై కేసు **తే. 13.03.2025ది**కి వాయిదా వేయబడినదని ఈ బహిరంగ ప్రకటన మూలంగా మీకు తెలియజేయు చున్నాము. కావున **తే.13.03.2025 దిన** గానీ ముందుగా గానీ **ఉదయం 10.30 ని॥**లకు పైన పేర్కొన్న శ్రీ కోర్టు వారి ఎదుట హాజరై మీ వాదనను వినిపించవలసిందిగా కోరడమైనది. లేని యెడల మీపై పరోక్షంగా Civil & Criminal చర్యలు తీసుకొనబడునని యిందుమూలంగా తెలియజేయడమైనది.

పై విషయము శ్రీ మహారాశ్రీ జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్, రాజాం వారి ఆదేశం మేరకు బహిరంగ ప్రకటన యివ్వడం జరిగినది.

ఎ. సత్యన్నారాయణ
అడ్వకేట్, రాజాం
సెల్ నెం.9949176936